
జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 23 జూన్ 2025
www.ntnews.com


# నిధి చాలా సుఖమా!

ధన దారేషు వృద్ధేషు దుఃఖం యుక్తం న తుష్టతా।
వృద్ధాయాం మోహమాయాయాం కః సమాశ్వాసవానిహ
(మహోపనిషత్తు 5-168)

'ధన దారాదులు వృద్ధి చెందితే దుఃఖించాలి కాని, సంతృప్తి చెందరాదు. మోహమాయ పెరిగితే ప్రపంచంలో ఎవనికి శాంతి కలుగుతుంది?' అని పై ఉపనిషత్ వాక్య భావం. ధనదారాదులంటే డబ్బు, భార్యా పిల్లలు మొదలైనవి. ఇవి పెరిగే కొద్దీ సమస్యలే తప్ప మనశ్శాంతి లభించదు కదా! ధనం పట్ల ఏ రకమైన యావ లేని మహానుభావుని జీవిత వృత్తాంతం ఒకటి ఈ సందర్భంగా తెలుసుకుందాం.



తంజావూరు దగ్గర 'తిరువయ్యూరు గ్రామంలో ఒక భిక్షుకుడు చిరుతలు వాయిస్తూ పాడుతున్నాడు. చేతిలో తంబురా.. వీపున పాత్ర ఉన్నవి. గృహస్థులు భిక్ష వేస్తున్నారు. ఈ లోపల ఆ పాత్రలో ఒక బ్రాహ్మణుడు బియ్యం వేశాడు. భిక్షుకుడు వెంటనే వణికిపోయాడు. ఎందుకంటే బియ్యంతోపాటు అందులో బంగారు నాణేలు ఉన్నాయి. అది చూసి వెంటనే బియ్యాన్ని నడివీధిలో పారబోశాడు. నాణేలతో బియ్యం మైల పడ్డా యనుకున్నాడేమో! అని బ్రాహ్మణుడు ఆశ్చర్యపోయాడు.

ఆ భిక్షుక గాయకునికి బంగారం అంటే వైరాగ్యం. తంజావూరు పాలకుడు శరభోజీ మహారాజు అతనికి ఎలాగైనా ధనం సమర్పించాలని వ్యర్థ ప్రయత్నాలు చాలా చేశాడు. చివరకు బియ్యంలో నాణేలు నింపి భిక్ష వెయ్యమని బ్రాహ్మణుడిని నియోగించాడు. అదీ ఇలా విఫలం అయింది. అంతటి 'వైరాగ్యం' కలిగిన గాయకుడు సామాన్యుడా! శ్రీరామచంద్రుని కల్యాణ గుణాలను కీర్తిస్తూ కృతులను విరచించిన భారతీయ వాగ్గేయకారులలో మొట్టమొదటివాడు, త్యాగరాజు.

'నిధి చాలా సుఖమా! రాముని/ సన్నిధి సేవ సుఖమా! నిజముగ పల్కు మనసా..' మొదలైన కీర్తనలు ఆయన వైరాగ్యాన్ని, రామభక్తిని వేనోళ్ల నిరూపిస్తాయి. రాజులెంత గొప్పవాళ్లు అయినా వారిని స్తుతించరాదని ఈ కీర్తనలోనే.. 'మమతా బంధనయుత నర స్తుతి సుఖమా..' అని బాహాటంగా చెప్పాడు. తన సంగీతాన్నంతా సర్వేశ్వరుడైన శ్రీరామచంద్రునికి సమర్పించుకున్న మహాభక్తుడుగా, 'నాదబ్రహ్మ'గా పేరు గాంచిన సంగీత చక్రవర్తి త్యాగరాజు.


... డా॥ వెలుదండ సత్యనారాయణ

# వేగ పరిమితి

ఓ ప్రవచనకారుడు పట్టణంలోని అనేక ప్రాంతాలకు వెళ్లి ధార్మిక ఉపన్యాసాలు ఇస్తూ ఉండేవాడు. ఆ ప్రవచనకారుడి అబ్బాయి సంస్కృతంలో డిగ్రీ చేస్తూ ఉన్నాడు. ఈ కార్యక్రమాలన్నిటికీ తండ్రిని తన కారులో తీసుకుని వెళ్లేవాడు. కార్యక్రమం పూర్తయ్యేంత వరకు అక్కడే ఉండి తండ్రిని ఇంటికి తీసుకుని వచ్చేవాడు. వచ్చిన శ్రోతలు ఆసక్తిగా వినడం గమనించేవాడు. అయితే కార్యక్రమం అయ్యాక ప్రసాదం పంపకం దగ్గర వారు తోసుకోవడం గమనించాడు. ఒకరోజు ఆ అబ్బాయి తండ్రితో చిన్న అనుమానం వ్యక్తం చేశాడు. 'సహృదయంతో నిర్వాహకులు వేల రూపాయలు ఖర్చుపెట్టి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. మీరు కూడా ఎండైనా వానైనా వెళ్లి ఉపన్యాసాలు ఇస్తూ ఉంటారు. అక్కడికి వచ్చే జనం మీరు చెప్పే మంచి మాటలను అనుసరిస్తారా? వారు అనుసరించకపోతే మీ శ్రమ అంతా వృథానే కదా' అని అడిగాడు.

దానికి తండ్రి నవ్వి రోడ్డు పక్కన ఉన్న స్పీడ్ లిమిట్ బోర్డులను కొడుక్కి చూపుతూ... 'అధిక వేగం ప్రమాదమని, దారిలో వేగానికి పరిమితి ఉందని ప్రభుత్వం వారు హెచ్చరిక బోర్డులు పెడతారు. పాటించిన వారు సుఖపడతారు. లెక్క చేయకుండా వేగంగా వెళ్లినవారు ఇబ్బందుల పాలవుతారు. 'మెరుపులాంటిది జీవితం. ఇది శాశ్వతం కాదు. ప్రకృతి ప్రసాదించిన జీవితాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి' అని గుర్తుచేసే సూచికలవి. అలాగే మేము చేసే కార్యక్రమాలు కూడా హెచ్చరిక బోర్డుల లాంటివి. హెచ్చరించడం అనేది మేధావుల బాధ్యత. విన్నవారిలో అందరూ కాకపోయినా కొందరైనా మంచి మార్గం వైపు నడుస్తారనేది మన ఉద్దేశం. అంతే కాదు, రైలుపట్టాల మీదనే రైలు నడిచినట్లు జీవితం నడవదు. ఎన్నో కష్టాలు, నష్టాలు, సుఖాలు, సంతోషాలు ఉంటాయి. జీవితం పట్ల అవగాహన పెంచుకుని స్పృహతో జీవనం సాగిస్తారని ఈ కార్యక్రమ నిర్వాహకుల నమ్మకం. అన్నమాచార్యులు చెప్పిన 'మాపులే మరణములు... రేపులే ... పుట్టువులు' అన్న విషయం జనం గుర్తు పెట్టుకుంటే చాలు' అని వివరించాడు. ఆ మాటలు విన్న కొడుకు కారు వేగ పరిమితి తగ్గించి ఇంటికి దారితీశాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821




కథాసుధ

# ఆరు హక్కులు

ప్రతీ ముస్లిం సమాజమనే నిర్మాణంలో ఇటుక లాంటివాడు. అందుకే దైవ ప్రవక్త (సల్లం) విశ్వాసులు పరస్పర కట్టడం లాంటి వారని... వారు ఒకరికొకరు ఊతంగా, ప్రేమ-వాత్సల్యాలు కలిగి ఉంటారని తెలిపారు. నిజానికి వారంతా ఒక శరీరం లాంటివారు. అందులో ఏ అవయవానికి దెబ్బ తగిలినా మిగతా శరీరమంతా బాధను అనుభవిస్తుంది. ప్రతి ముస్లిం తోటి ముస్లింలపై ప్రేమాభిమానాలతో పాటు దయ చూపి, వారికి అవసరమైన సహకారం అందించాలి. నమాజ్‌కు సారథ్యం వహించే వ్యక్తి అక్కడున్న వారిలో పిన్నలు, వ్యాధిగ్రస్తులు, ముసలివారు ఉంటే వారిని దృష్టిలో పెట్టుకొని నమాజును సంక్షిప్తంగా చేయించాలి. తన అనుచరుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్విరామంగా ఉపవాసాలు పాటించొద్దని వారిని ఆదేశించారు. ప్రతి ముస్లిం తాను తోటి ముస్లింకు సోదరుడినని భావించాలి. ఇలాంటి భావన ఉన్నవారు పరస్పరం ఒకరి అవసరాల్లో ఒకరు సహకరించుకొంటారని దైవప్రవక్త(స) ఏనాడో చెప్పారు. తోటి ముస్లింకు వచ్చిన కష్టాన్ని తొలగించిన వారికి ప్రళయ దినాన వచ్చే కష్టాన్ని అల్లాహ్ తొలగిస్తాడు. కాబట్టి దైవ ప్రవక్త ఆదేశాల మేరకు ముస్లింలందరూ ఒకరిపై ఒకరు దౌర్జన్యానికి, మోసానికి పాల్పడకుండా స్నేహ సహకారాలతో కలిసిమెలిసి ఉండాలి. తోటి ముస్లింలను ఎన్నడూ నిస్సహాయ స్థితిలో వదిలేయకూడదు. 'నీ సోదరుడు దౌర్జన్యం చేసేవాడైనా, పీడితుడైనా అతనికి సహాయం చెయ్యి' అని ప్రవక్త ఆదేశించారు. అంటే దౌర్జన్యం చేసే వ్యక్తిని ఆ పని చేయకుండా ఆపడమే మనం అతడికి చేసే సాయం కావాలనేది ఆయన బోధన పరమార్థం. సలాం చెప్పిన వారికి ప్రతి సలాం చేయడం, మన పరిచయస్తుల్లో రోగాలతో బాధపడుతున్న వారిని పరామర్శించడం, తెలిసిన వ్యక్తి శవయాత్రకు హాజరవడం, ఆప్తుల శుభకార్యాల ఆహ్వానాలను అంగీకరించడం, తుమ్మినప్పుడు ఇస్లాం సూచించిన జవాబు చెప్పడం, ఇతరులు మన మంచిని ఆశిస్తే తిరిగి వారి బాగును కోరుకోవడం ప్రతి ముస్లింకు ఉన్న ఆరు హక్కులు. ఇవి ముస్లింల మధ్య ప్రేమానుబంధాలను బలోపేతం చేస్తాయి.

ఇస్లాం బోధ



... ముహమ్మద్ ముజాహిద్
96406 22076



# ప్రదక్షిణ పరమావధి

**ఆలయాన్ని చేరుకోగానే భక్తులు సాధారణంగా చేసే ప్రక్రియ ప్రదక్షిణ. కేవలం ప్రదక్షిణలు చెయ్యటం కోసమే గుడికి వెళ్లే భక్తులు కూడా ఉంటారు. తమ కోరిక తీరటం కోసం దైవానికి మొక్కుకునే మొక్కుల్లో ప్రదక్షిణ కూడా ఒకటి. జాతకరీత్యా గ్రహానుకూలం లేకపోయినా, ఏవైనా అరిష్టాలు జరుగుతున్నా కూడా ఆలయాల్లో ప్రదక్షిణలు చేస్తుంటారు. ఫలానా ఆలయంలో ప్రదక్షిణ చేస్తే కోరికలు తీరుతాయనే ప్రసిద్ధి పొందిన దేవాలయాలు మనదేశంలో చాలా ఉన్నాయి. ఇంతకీ ప్రదక్షిణ పరమార్థం ఏంటి?**

భక్తుడు పరిపూర్ణంగా భగవంతుడికి దాసుడయ్యే క్రమంలో వారిద్దరికి మధ్య అనుసంధానంగా నిలిచే వ్యవస్థల్లో ఉన్నతమైంది 'ప్రదక్షిణ'. ఇదొక రకమైన శరణాగతి. భక్తుడు తనను తాను దైవానికి సమర్పించుకున్నట్టు ప్రకటించే విధానం ఇది. భగవంతుడికి చేసే ఉపచారాల్లో పరిపూర్ణమైన ఉపచారం కూడా ఇదే. గుడికి వచ్చిన భక్తుడి మానసిక స్థితి సాధారణ స్థితికి రావాలంటే అక్కడి దైవికమైన శక్తి వలయంలో ఒక మూడుసార్లు ప్రదక్షిణ తప్పక చెయ్యాలి. వైద్యం నిరూపించిన శాస్త్రం కన్నా ముందుగానే ఆచారం పేరుతో మన సంస్కృతి సాధించిన వైజ్ఞానిక ప్రగతికి నిదర్శనం ఇది.

### ప్రదక్షిణ అంటే...

ప్రదక్షిణ అనే పదానికి 'తిరగటం' అనే అర్థం ఉంది. ప్రదక్షిణ క్రియారూపంలో చేసే ప్రణవ (ఓంకారం) జపం అని శివపురాణం చెబుతున్నది. అంతరాలయం చుట్టూ చేస్తే దాన్ని పరిక్రమం అంటారు. బయట ప్రాకారం చుట్టూ చేస్తే దాన్ని ప్రదక్షిణ అంటారు. దేవుడికి చేసే షోడశ ఉపచార పూజలో చివరి అంకం కూడా ఇదే.

భగవాన్ రమణ మహర్షి బోధనల ప్రకారం ప్రదక్షిణ అనే పదంలో 'ప్ర'- సమస్త పాపాల వినాశనాన్ని సూచిస్తుంది. 'ద'- కోరికలు తీరటానికి సంకేతం. 'క్షి'- రాబోయే జన్మల క్షయాన్ని సూచిస్తుంది. 'ణ'- అజ్ఞానం నుంచి విముక్తి లభించటం. ఈ కోణంలో ప్రదక్షిణ ప్రక్రియను పరిశీలిస్తే ఈ జన్మలో మన కోరికలు తీర్చటమే కాకుండా జనన మరణ బంధాల నుంచి మనిషిని విముక్తుడిని చేసే సర్వోన్నతమైన ప్రక్రియ అని భావించవచ్చు.

ఆలయానికి చేరుకోగానే భక్తులు అక్కడి ఏర్పాటును అనుసరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. చేతులు జోడించి, ఆలయంలో కొలువైన దైవాన్ని స్మరిస్తూ, ఆ స్వామికి సంబంధించిన స్తోత్రాలు, శ్లోకాలు చదువుకుంటూ తాము అనుకున్న సంఖ్య ప్రకారం ప్రదక్షిణలు చేస్తారు.

### కాలనియమం

**నిత్యం** ఆలయంలో చేసే ప్రదక్షిణకు, ప్రత్యేక సందర్భాల్లో చేసే ప్రదక్షిణకు ఫలితాల్లో తేడా ఉంటుంది. అష్టమి, చతుర్దశి, పౌర్ణమి, ఆదివారంతో కలిసి వచ్చిన ఆరుద్ర నక్షత్రం, దక్షిణాయన, ఉత్తరాయణ ప్రారంభకాలాలు, సూర్య, చంద్ర గ్రహణ సమయాలు, ఉత్సవాలు మొదలైన సమయాల్లో చేసే ప్రదక్షిణలు ప్రత్యేక ఫలితాలను ఇస్తాయి. ఈ సమయాల్లో ఆలయాల్లో ఉండే పుష్కరిణిలో స్నానం చేసి, ప్రదక్షిణలు చేస్తే సాధారణ రోజుల్లో చేసే ప్రదక్షిణల కన్నా వందరెట్లు ఎక్కువ ఫలితం లభిస్తుందని ఆగమ శాస్త్రాలు చెబుతున్నాయి.

మెల్లగా నడవటం, మనసులోకి ఇతరమైన ఆలోచనలు రానివ్వకపోవటం, చేతులు జోడించి నమస్కరించటం ప్రదక్షిణలో ప్రధానమైన అంశాలు. ఇంట్లో నిత్యవిధుల్లో భాగంగా చేసే పూజ పూర్తయిన తర్వాత ఆత్మప్రదక్షిణ తప్పనిసరిగా చెయ్యాలి. ఆలయాల్లో ఆత్మ ప్రదక్షిణ చెయ్యకూడదు.

భక్తులు పూజల్లో భాగంగా చేసే ఆత్మప్రదక్షిణ, దైవానికి ఆలయంలో చేసే ప్రదక్షిణ కూడా భూమి తన చుట్టూ తాను తిరగటం, సూర్యుడి చుట్టూ తిరగటం అనే విషయాల్ని ప్రతిబింబిస్తుంది. ఇలా భ్రమణం చేయటం ద్వారా మన జ్ఞానానికి అతీతమైన శక్తిని దైవం నుంచి పొందుతాం. ఇది మనసుకు, శరీరానికి కూడా మేలుచేస్తుంది. తద్వారా మనిషికి ప్రశాంతత, జ్ఞానం పెరుగుతాయి.



**ఆత్మ ప్రదక్షిణ:** తనచుట్టూ తానే చేసుకొనే ప్రదక్షిణ
**పాద ప్రదక్షిణ:** పాదాలతో నడుస్తూ ఆచరించే ప్రదక్షిణ
**దండ ప్రదక్షిణ:** అవ్యగ్ర చిత్తంతో దండ ప్రణామాలు చేస్తూ ఆచరించే ప్రదక్షిణ
**అంగ ప్రదక్షిణ:** సాత్వికావయవాలు నేలకు తగిలేటట్టుగా దొర్లుకుంటూ చేసే ప్రదక్షిణ
**గిరి ప్రదక్షిణ:** దేవుడు కొలువుండే కొండ చుట్టూ చేసే ప్రదక్షిణ

### విధానాలు

ఆలయాల్లో చేసే ప్రదక్షిణల్లో చాలా విధానాలు ఉన్నాయి. మామూలుగా ధ్వజస్తంభం నుంచి ప్రారంభించి తిరిగి చివరకు ధ్వజస్తంభం వద్దకు చేరుకుని దైవానికి నమస్కరించడం ఒక ప్రదక్షిణ క్రమం. చండీశ్వరుడున్న శివాలయంలో ప్రదక్షిణ విధానం మరొక పద్ధతిలో ఉంటుంది. దానికి చండీ ప్రదక్షిణం అని పేరు. దీనికే సోమసూత్ర ప్రదక్షిణం అనే పేరు కూడా ఉంది. శివ ప్రదక్షిణలో సోమసూత్రాన్ని దాటకూడదు. (సోమసూత్రం దగ్గర ప్రమథ గణాలు కొలువై ఉంటాయి. అందువల్ల సోమసూత్రాన్ని ఎట్టి పరిస్థితుల్లో దాటకూడదని నియమం).

### ఏ ప్రదక్షిణ... ఎక్కడ?

**సాధారణంగా** ఆలయం చుట్టూ ప్రదక్షిణ చెయ్యటం అందరికీ అలవాటు. దీంతోపాటు మరికొన్ని ప్రత్యేక స్థానాలు, అక్కడ చేసే ప్రదక్షిణ ఫలితాలను కూడా అజితాగమం వంటి కొన్ని ఆగమాలు వివరంగా చెబుతున్నాయి. వీటి ప్రకారం అంతర్వారం (రెండవ ప్రాకారం)లో చేసే ప్రదక్షిణకు సాధారణ ప్రదక్షిణ కన్నా రెండు రెట్లు ఎక్కువ ఫలితం లభిస్తుంది. మధ్యహారం (మూడవ ప్రాకారం)లో చేస్తే మూడు రెట్లు, మర్యాది (నాల్గవ ప్రాకారం)లో చేస్తే నాలుగు రెట్లు, మహామర్యాది (ఐదవ ప్రాకారం)లో చేస్తే ఐదురెట్లు ఎక్కువ ఫలితాన్ని పొందుతారు. గర్భగుడికి చుట్టూ ఉండే తొలి ప్రాకారంలో ప్రదక్షిణలు చెయ్యటానికి అందరికీ అధికారం లేదు. అర్చకులు, దీక్ష పొందిన వారికి (వీళ్లను దీక్షితులు అంటారు) మాత్రమే ఈ ప్రాకారంలో ప్రదక్షిణ చేసే అవకాశం ఉంది. వీటితోపాటు క్షేత్రం చుట్టూ ప్రదక్షిణ చేస్తే వంద రెట్లు ఎక్కువ ఫలితం కలుగుతుంది. అరుణాచల గిరి ప్రదక్షిణ ఇందుకు ఉదాహరణ.

### అంగ ప్రదక్షిణ

చాలా కష్టాల్లో ఉన్నప్పుడు భక్తులు తమ ఇష్ట దైవం కొలువైన ఆలయంలో అంగ ప్రదక్షిణలు చేస్తామని మొక్కుకుంటారు. ఈ తరహా ప్రదక్షిణలు చాలా కష్టంతో కూడుకున్న పని. అంగ ప్రదక్షిణం చేయటానికి ఆగమాల ప్రామాణికాలు ఉన్నాయి. అంగ ప్రదక్షిణ చేయాలని అనుకున్న భక్తుడు భూమిపై పడుకుని, చేతులు జాపి నమస్కార ముద్ర ధరించాలి. కర్ర నేల మీద పడినట్టు ఉండాలి. అలాంటి భంగిమలో సిద్ధంగా ఉండి, స్వామికి నమస్కారం చేసి, నేల మీద పడుకుని ఉంటూనే కుడివైపునకు తిరుగుతూ (దొర్లుతూ) ప్రదక్షిణ చెయ్యాలి. దీన్నే అంగ ప్రదక్షిణ అంటారు. ఎక్కడ నుంచి ప్రారంభించామో తిరిగి అక్కడికి చేరుకోవటంతో ఒక ప్రదక్షిణ పూర్తవుతుంది. భక్తుడు తాను మొక్కుకున్న మొక్కును బట్టి అన్ని ప్రదక్షిణలు పూర్తి చెయ్యాలి. ఈ ప్రదక్షిణకు సంబంధించిన వివరాలు అజితాగమంలో ఉన్నాయి.

### పురాణగాథలు

'విశ్వమంతా తిరిగి శీఘ్రంగా ప్రదక్షిణ చేసి వచ్చిన వానికే గణాధిపత్యం' అని పార్వతీపరమేశ్వరులు షరతు విధించినపుడు కుమారస్వామి మయూర వాహనం ఎక్కి విశ్వాన్ని చుట్టి రావడానికి బయల్దేరాడు. మూషిక వాహనుడైన మహాగణపతి అలా వెళ్లలేకపోయాడు. కానీ, తెలివిగా పార్వతీ పరమేశ్వరుల చుట్టూ ప్రదక్షిణ చేశాడు. దాని ఫలితమా అన్నట్టు... సుబ్రహ్మణ్యుడు వెళ్లిన ప్రతిచోటా అంతకుమునుపే గణపతి వచ్చి వెళ్లిన జాడలు కనిపించాయి. ముందుగా విశ్వాన్ని చుట్టి వచ్చినవాడు వినాయకుడేనని నిర్ణయించి- శివుడు, ఇతర దేవతలు అతనికే గణాధిపత్యాన్ని ఇచ్చారు. ప్రదక్షిణ చెయ్యటం వల్ల కలిగే సమున్నతమైన ఫలితానికి గజాననుడు పొందిన గణాధిపత్యమే నిదర్శనం.

### పరమార్థం

ఆలయంలో ఉన్న దైవం విశ్వశక్తి కేంద్రబిందువునకు ప్రతీక. ఆయన చుట్టూ ఉన్న ఆలయం అనంత విశ్వానికి సంకేతం. ప్రపంచంలో జరిగే పరిణామాలే ప్రదక్షిణలు. జీవితం అంటే ఒక చుట్టు. జననం నుంచి మరణం వరకు జరిగే తంతులో మన జీవితమే ఒక ప్రదక్షిణ. ఇలా ఎన్నో జన్మల్లో సంపాదించుకున్న కర్మల ఫలితాన్నే ఈ జన్మలో అనుభవిస్తాం. ప్రదక్షిణ పేరుతో పరమాత్ముని చుట్టూ తిరగడం వలన జన్మల చుట్లలో చేసిన కర్మల దుష్ఫలితాలను తొలగించుకునేందుకు అవకాశం చిక్కుతుంది. అంతే కాదు... అత్యధిక ప్రదక్షిణలు చేయడం వల్ల రానున్న జన్మల చుట్లను (కర్మ ఫలితాలను) కూడా అధిగమించవచ్చు. కర్మక్షయమే ప్రదక్షిణలో పరమార్థం. మన మనోవాక్కాయ కర్మలు పరమేశ్వరుని చుట్టూ పరిభ్రమించాలన్నదే ప్రదక్షిణలో ప్రధానోద్దేశం.

వేదాంత పరంగా ఆలోచన చేస్తే ప్రదక్షిణ ప్రక్రియలో అద్భుతమైన అంతరార్థం ఉంది. ఆలయంలో ప్రదక్షిణలు చేసేటప్పుడు మొదటి ప్రదక్షిణలో మనిషి తనలో ఉండే తమోగుణాన్ని త్యజించాలి. రెండో ప్రదక్షిణ చేసేటప్పుడు రజోగుణాన్ని వదిలేయాలి. మూడో ప్రదక్షిణలో సత్త్వగుణాన్ని వదిలేయాలి. అంటే మొత్తంగా మూడు ప్రదక్షిణలు పూర్తయ్యే సరికి మనిషి త్రిగుణాలకు అతీతమైన స్థితికి చేరుకోవాలి. ఆవిధంగా త్రిగుణాతీతమైన స్థితికి చేరుకున్న తర్వాత ఆలయంలో ప్రవేశించి అక్కడ కొలువైన త్రిగుణాతీతుడైన దైవాన్ని దర్శించుకోవాలి. ప్రదక్షిణ వెనుక దాగున్న అసలైన అర్థం, పరమార్థం ఇది.

... డా॥ కప్పగంతు రామకృష్ణ

# ప్రభువు ఆనతి మేరకు

క్రీస్తు సందేశం

అపోస్తుల చర్యలు మహత్కార్యాలుగా కనిపిస్తాయి. పునరుత్థాన క్రీస్తు నలభై రోజులపాటు అక్కడే ఉన్నాడు. శిష్యులు ఏమేం చేయాలో దిశా నిర్దేశం చేశాడు. లూదియా, సమరియా, జెరూషలేం ప్రాంతాలంతటా సువార్త ప్రకటించమని ఆదేశించాడు. ప్రభువు లక్ష్యం, దేవుని సంకల్పం తెలుసుకోవాలనే ఉద్దేశంతో 'ప్రభూ! మళ్లీ ఇశ్రాయేలీయ రాజ్య స్థాపన సాధ్యమా' అని శిష్యులు ప్రభువును అడిగారు. 'కాలములను సమయములను తండ్రి తన స్వాధీనమందుంచుకొని యున్నాడు; వాటిని తెలుసుకొనుట మీ పనికాదు. అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు. గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంతముల వరకును ఈ సత్యసందేశాన్ని బహు శక్తిమంతంగా ప్రకటించగలరు' అని ప్రభువు ఆదేశించాడు (అపో. కా. 1:7-8). ప్రభువుపై అఖండమైన విశ్వాసాన్ని నింపుకొని, ధైర్యాన్ని కూడగట్టుకొని, ఆ శిష్య అపోస్తులు ప్రజాహిత చర్యల కోసం ముందుకు సాగారు. గుంపులు గుంపులుగా చీలి, ఆ తరువాత తలోదిక్కుగా పయనించి తాము చేయవలసిన వాక్య బోధ ప్రారంభించారు.

... ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024

### ఇంట్లో నిత్యపూజ ఉదయం చేయలేకపోతే, సాయంత్రం చేయవచ్చా?

• శివాజీ, మెదక్

# తప్పనిసరైతేనే.. సాయంత్రం!

పూజ అనేది సమర్పణతో కూడిన దైవారాధన. స్థూలంగా మనం రక్షణ, స్వతంత్రత, అభివృద్ధి, సుఖం, ప్రశాంతత, ముక్తి కోసం.. దైవారాధన చేస్తుంటాం. వివిధ ద్రవ్యాలతో పూజ చేసినా.. కర్తకు ప్రధానంగా ఉండవలసింది నిర్మలమైన మనసు! ఆర్ష సంప్రదాయం ఆధ్యాత్మిక సాధనలకు ప్రాతః సంధ్యాకాలం శ్రేష్ఠమైనదని నిర్ణయించింది. ఆ సమయంలో ప్రకృతి పరిశుద్ధంగా, ఉష్ణోగ్రత తీవ్రతలు లేకుండా, ప్రశాంతంగా భగవంతుడి సేవకు అనుకూలంగా ఉంటుంది. అంతేకాదు, రాత్రి నిద్రపోయి ఉదయాన్నే లేచిన మనిషికి అలసట తీరిపోతుంది. మనసు కుదుటపడుతుంది. కొత్త ఉత్సాహంతో ఉంటాడు. అందుకే ప్రాతఃకాలంలో పూజ చేయడం వల్ల మనసు దేవుడిపై లగ్నం అవుతుంది. వేకువజామున, తొలి సంధ్యవేళలో దైవారాధన వల్ల దేవతానుగ్రహం లభిస్తుందని శాస్త్ర వచనం. అయితే, ఏ కారణం వల్లనైనా నిత్యారాధన ఉదయం వీలుపడకపోతే కుంగిపోవలసిన పనిలేదు. సాయంకాలం కూడా అనువైనదే! అయితే, పగలు బాగా పనిచేసి అలసిపోతాం. దీనికితోడు నానారకాల సామాజిక స్పందనలకు గురై మనసు నిశ్చలంగా ఉండకపోవచ్చు. కాబట్టి, సాయంత్రం పూజ చేయాల్సివచ్చిన నాడు పూజకు ముందు కాసేపు విశ్రాంతి తీసుకొని, చక్కగా స్నానం చేసి అర్చన చేయవచ్చు. పూజకు ప్రాతఃకాలమే తొలి ప్రాధాన్యం. తప్పనిసరి పరిస్థితుల్లో సాయంత్రం చేయవచ్చు.

... శ్రీ